క్లుప్తంగా

రంగంపేట ఎండీపీఓగా వెంకటరత్నం



రంగంపేట: రంగంపేట ఎంపీడీఓగా పి.వెంకటరత్నం నియమితులయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విస్తరణ అధికారి(ఈఓపీఆర్డీ)గా పనిచేస్తున్న వెంకటరత్నంను పూర్తి అదనపు బాధ్యతలతో ఎంపీడీఓగా నియమిస్తూ కాకినాడ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. కాగా ఇప్పటి వరకు రంగంపేట ఎంపీడీఓగా విధులు నిర్వహించిన బి.శ్రీరామరాజు ఆదివారం పదవీ విరమణ పొందారు.

కన్నుల పండువగా కల్యాణం



వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెదపూడి: స్థానిక గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు ఆదివారం ఉదయం 8.51 గంటలకు కన్నుల పండువగా నిర్వహించారు. మండలం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి భక్తి పారవశ్యులయ్యారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని ఆలయంలో ఆదివారం ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని వ్రత పూజలు చేసుకున్నారు. భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

చురుగ్గా బురద కాలువ పూడికతీత



శ్రీరంగపట్నంలో నిర్వహిస్తున్న బురద కాలువ పూడికతీత పనులు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామంలోని బురద కాలువ పూడికతీత పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ పనులు ఆదివారం నాటికి ఆరో రోజుకు చేరింది. సాగు నీటి సరఫరాకు ఆటంకం కలగకుండా ఉండేందుకు సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, మద్దాల రమణ ఆధ్వర్యంలో పూడికతీత పనులు నిర్వహిస్తున్నారు. రాఘవపురం గ్రామ సరిహద్దు నుంచి ప్రారంభమైన పనులు శ్రీరంగపట్నంలో శివారు ప్రాంతానికి చేరాయి. ఈ సందర్భంగా స్థానిక రైతు నాయకుడు మద్దాల రమణ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పంటకు సాగునీటి సమస్య రాకుండా ఉండాలని పనులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అలాగే బురద కాలువ వరద నీరు గ్రామంలో నివాసాలపైకి చేరి ముంపు సమస్య ఉత్పన్నం కాకుండా నివారించేందుకు ఈ పనులు చేపట్టనట్టు వివరించారు. ఇప్పటి వరకూ ఆరు కి.మీ. మేర పనులు జరిగాయన్నారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పర్యవేక్షించారు.

రఘుదేవపురంలో మంత్రి దుర్గేష్

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం గ్రామ సచివాలయంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ కొద్దిసేపు బసచేశారు. ఆదివారం దేవీపట్నం మండలం గండి వద్ద నుంచి పాపికొండల పర్యటనకు వెళ్లే బోట్లను ఆయన పరిశీలించారు. అలాగే గోదావరి వరద తీరుతెన్నులపై ఆరాతీశారు. అనంతరం అక్కడ నుంచి రాజమహేంద్రవరం వెళుతూ రఘుదేవపురం సచివాలయం వద్ద కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా పలువురు నాయకులను కలుసుకున్నారు.

అనపర్తిలో తీవ్ర ఉద్రిక్తత



పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



అనపర్తిలో పోలీసులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- అధికార పార్టీ నేతల దాడులపై మండిపడిన మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి
- బాధితులకు సంఘీభావం తెలిపేందుకు వెళుతుండగా పోలీసుల అడ్డగింత

పెదపూడి: వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడితే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. ఇటీవల వైఎస్సార్ సీపీ శ్రేణులపై ఎన్డీఏ నాయకులు చేస్తున్న దాడుల్లో గాయపడిన బాధితులకు సంఘీభావం తెలపడానికి వెళుతున్న డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అనపర్తిలో ఆదివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన తమ పార్టీ నేత ఇంటి వద్ద కొంతమంది టెంట్ వేయించి వేధిస్తున్నారని, బాధితునికి సంఘీభావం తెలిపేందుకు అక్కడకు వెళదామంటూ మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దీంతో ఆదివారం ఉదయం పార్టీ శ్రేణులు భారీగా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులతో సమావేశమై ప్రస్తుతం నియోజకవర్గవ్యాప్తంగా అధికార పార్టీ నేతలు సాగిస్తున్న దాడులపై చర్చించారు. అధికారం వచ్చినంత మాత్రాన ఇష్టమొచ్చినట్లు ప్రజలపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని మండిపడ్డారు. మరోవైపు రాజమహేంద్రవరం నుంచి వచ్చిన డీఎస్పీలు కిషోర్ కుమార్, అంబికాకృష్ణల ఆధ్వర్యంలో పోలీసులు భారీగా బలగాలను మోహరించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కుతుకులూరు వెళ్లడానికి బయలుదేరుతుండగా పోలీసులు అడ్డగించారు. దీంతో పోలీసులు, సూర్యనారాయణరెడ్డి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.

పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారు

తమ పార్టీ శ్రేణులపై అధికార పార్టీ నేతలు దాడులు చేస్తున్నారని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారంటూ నిలదీశారు. కుతుకులూరులో తమ పార్టీ నాయకుడి ఇంటి వద్ద కొందరు కావాలని ఆందోళన చేపట్టినా ఎందుకు పట్టించుకోవడం లేదంటూ ప్రశ్నించారు. తామంత కచ్చితంగా కుతుకులూరు వెళ్లి తమ నాయకుడికి అండగా నిలబడతామన్నారు. దీంతో కుతుకులూరులో వైఎస్సార్ సీపీ నేత ఇంటి వద్ద వేసిన టెంట్ తొలగించి ఆందోళన విరమింపజేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఉద్రిక్తతకు తెరపడింది. కార్యక్రమంలో అనపర్తి మండల పార్టీ కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, నల్లమిల్లి బాలమురళీ కృష్ణారెడ్డి, రంగంపేట జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, గుత్తుల రమణ, పోతుల ప్రసాదరెడ్డి, ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళిత సర్పంచ్‌లపై ఆరోపణలు మానుకోవాలి

ఎంపీపీ జ్యోత్స్న



సర్పంచ్‌కు మద్దతు తెలుపుతున్న ఎంపీపీ, నాయకులు

సీతానగరం: మండలంలోని దళిత సర్పంచ్‌లపై నిందారోపణలు మానుకోవాలని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న హితవు పలికారు. ఆదివారం రఘుదేవపురం సచివాలయంలో సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల, వైఎస్సార్ సీపీ దళిత నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రఘుదేవపురం పంచాయతీలో రూ.76 లక్షలు దుర్వినియోగం అయ్యాయని టీడీపీ వారు చేస్తున్న ఆరోపణలపై సర్పంచ్ చంద్రలీల స్పందించారు. నిధులు దుర్వినియోగం అయ్యాయని మానసికంగా ఇబ్బంది పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ తప్పు చేయకపోయినా నాయకులందరి ఎదుట అవమానపర్చారని కంటతడి పెట్టారు. ఎంపీపీ జ్యోత్స్న మాట్లాడుతూ దళిత సర్పంచ్‌ను నిరాధార ఆరోపణలతో కూటమి నాయకులు వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి చర్యలు మానుకోవాలని కోరారు. డీఎల్‌పీఓ షోకాజ్ నోటీసులకు సమాధానం ఇచ్చామన్నారు. అవకతవకలు ఉంటే విచారణలో బయటపడతాయన్నారు. మండలంలో దళిత సర్పంచ్‌లను టార్గెట్ చేస్తూ కూటమి నాయకులు ఆరోపణలు చేస్తున్నారన్నారు. 2014లో ఎస్సీ, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల దుర్వినియోగంపై విచారణ జరగాలన్నారు. రికార్డులు భద్రపర్చాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శిదేనని తెలిపారు. సర్పంచ్ అనుమతి లేకుండా డంపింగ్ యార్డ్ మార్చడం కుదరదన్నారు. వైఎస్సార్ సీపీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు అంబటి రాజు మాట్లాడుతూ దళిత సర్పంచ్‌లపై కక్ష కట్టి, ఆరోపణలు చేయడం తగదన్నారు. దీనిపై దళితులు పోరాటానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు గెద్దాడ త్రిమూర్తులు, అడ్వకేట్ చిడిపి నకుల సురేష్‌లు మాట్లాడుతూ 2014లో సబ్‌ప్లాన్ నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు కొల్లి చిరంజీవి, పిండి రాధాకృష్ణ, యలమాటి సురేష్, చుండ్రు శ్రీనివాస్, వార్డు మెంబర్ భవాని తదితరులు పాల్గొన్నారు

కలెక్టర్ ఆకస్మిక రాక

తాళం వేసి ఉన్న మండల పరిషత్ కార్యాలయం

రాజానగరం: కలెక్టరుగా బాధ్యతలు స్వీకరించిన పి.ప్రశాంతి ఆదివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి ఆకస్మికంగా విచ్చేశారు. సెలవు దినం కావడంతో ఆ సమయంలో ఉద్యోగులు ఎవ్వరూ లేరు. కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో, సెల్‌ఫోన్‌తో కార్యాలయం ఫొటో తీసుకుని వెనుదిరిగారు. పక్కనే తహసీల్దారు కార్యాలయం ఉన్నా కానీ అటువైపు వెళ్లలేదు. అక్కడ కూడా ఆ సమయంలో చిరుద్యోగులు మాత్రమే ఉన్నారు. విధి నిర్వహణలో భాగంగా రంగంపేట మండలం, అచ్యుతాపురానికి వెళ్లిన ఆమె తిరిగొస్తూ మార్గం మధ్యలో రాజానగరం మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి వచ్చారు. సోమవారం నిర్వహించే సామాజిక పింఛన్లకు సంబంధించి సంబంధిత అధికారులతో మాట్లాడేందుకు ఆమె వచ్చి ఉండవచ్చని భావిస్తున్నారు.

ఆర్యాపురం బ్యాంకును పరిరక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు

ప్రకాశం నగర్: సుమారు 118 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ది ఆర్యాపురం కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకును అన్ని వర్గాల వారు రక్షించుకోవాలని, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో నూతన పాలక మండలి ఏర్పడాలని అఖిలపక్ష నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధుల రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆర్యాపురం బ్యాంకు పరిరక్షణ ధ్యేయంగా రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. బ్యాంకు మాజీ డైరెక్టర్ లంక సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఆర్యాపురం బ్యాంకు 78 వేల సభ్యత్వంతో అగ్రస్థానంలో ఉందని, ఇలాంటి బ్యాంకును రక్షించుకోవడానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాలక మండలిలో ఉండాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ ఎందరో మహానుభావులు రాజకీయాలకు అతీతంగా బ్యాంకును తీర్చిదిద్దారని కొనియాడారు. మాజీ డైరెక్టర్ లంక సత్యనారాయణ మాట్లాడుతూ బ్యాంక్ నేడు అభివృద్ధి చెందిందంటే ఒకప్పుడు సీపీఐ వేసిన పునాదే కారణమని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు బాలేపల్లి మురళీధర్, బోడా వెంకట్, సీపీఎం నగర కార్యదర్శి బి పవన్, జాంపేట బ్యాంక్ డైరెక్టర్ మహంతి లక్ష్మణరావు, మాజీ డైరెక్టర్ కొవ్వూరి శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు.



సమావేశానికి హాజరైన కేడర్



సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి. చిత్రంలో జక్కంపూడి రాజా, గూడూరి శ్రీనివాస్ తదితరులు

ప్రజల పక్షానే నిలిచాం

- కేడర్ మరింత బలోపేతం కావాలి
- వైఎస్సార్ సీపీ కీలక నేతల దిశానిర్దేశం
- పార్టీ సమావేశానికి భారీగా తరలివచ్చిన శ్రేణులు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికల అనంతరం నియోజకవర్గ స్థాయిలో దివాన్‌చెరువులోని ఎంఎఫ్ కన్వెన్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశానికి సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల నుంచి పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఓటమితో నిరాశ, నిస్పృహలకు ఏమాత్రం తావు లేకుండా, ప్రజల పక్షాన నిలిచామనే భావనతో మరింత బలోపేతం కావాలనే తలంపును అందిస్తూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ప్రసంగాలతో కేడర్‌ని చైతన్యపరిచారు.

సవాల్‌కు కట్టుబడి ఉన్నా..

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్లు, వారిచ్చిన తీర్పును ఎవరైనా శిరసా వహించాల్సిందేనన్నారు. రాజానగరం మండలంతో తమ కుటుంబానికున్న అనుబంధాన్ని దృష్టిలో పెట్టుకుని, ఈ మండల ప్రజలు తనకు ఎల్లప్పుడూ అండదండగా ఉంటారనే ఉద్దేశంతో ఎన్నికల్లో ఈ మండలంలో ఒక్క ఓటు ఎక్కువ తెచ్చుకున్నా, తాను రాజకీయాల నుంచి తప్పుకుంటాని ప్రత్యర్థికి సవాలు చేశానన్నారు. అయితే రాజకీయాల్లో ఉన్నప్పుడు మాట అనేది వ్యక్తిగతమని, నిర్ణయం మాత్రం సమష్టిగానే ఉంటుందని. తమ కుటుంబాన్ని అభిమానిస్తూ, ఆదరిస్తున్న వేలాది మంది కార్యకర్తల నిర్ణయం మేరకు నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. నియోజకవర్గంలో గడచిన ఐదేళ్లలో తాను చేసిన అభివృద్ధి కంటే ఎక్కువ చేయగలరని అనిపించిన రోజున, తాను చెప్పిన మాటకు కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. ఏడాదిలోగా ఈ మేరకు అభివృద్ధి చూపగలిగితే తన మాటకు కట్టుబడి ఉంటానని వివరించారు. జక్కంపూడి కుటుంబానికి అధికారంతో, పదవులతో పనిలేదని, ఎవరికి కష్టం వచ్చినా కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ఒక లాఠీ అయినా, తూటా అయినా జక్కంపూడి కుటుంబాన్ని దాటుకుని ముందుకు రావాలన్నారు.

వెనకడుగు వేసేది లేదు

పార్టీలో గ్రూపులు మంచిది కాదని, ఓటమికి అది కూడా కారణమనే భావిస్తున్నాను జక్కంపూడి రాజా అన్నారు. చాలాచోట్ల బహు నాయకత్వం ఉండటం భారీ నష్టం చేకూర్చిందని, కేడర్‌లో పోటీ తత్వం ఉంటే పార్టీ పటిష్టమవుతుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నామని వెనకడుగు వేసేది లేదని, అధికారంలో ఉన్నదాని కంటే ఎక్కువగా పనిచేస్తామన్నారు. పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చినా జక్కంపూడి కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా తమకు ప్రజలే ముఖ్యమన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లోని పార్టీకి చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి

రంగంపేట: మండలంలోని వడిశలేరులో ఏడీబీరోడ్డు పక్కన కొలువైయున్న విజయదుర్గాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ అర్చకుడు రేగడమిల్లి రాందేవ్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీ

- సచివాలయ సిబ్బందికి అదనపు బాధ్యతలు
- వివిధ విభాగాల ఉద్యోగుల భాగస్వామ్యం
- నియోజకవర్గంలో 40,904 మంది లబ్ధిదారులు



గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి పింఛను అందిస్తున్న పందలపాక వలంటీర్ మమత (ఫైల్)

మండలం	పింఛన్లు ఇవ్వనున్న మొత్తం సిబ్బంది	సచివాలయ సిబ్బంది	ఇతర ఉద్యోగులు
అనపర్తి	160	142	18
బిక్కవోలు	155	147	8
రంగంపేట	148	142	6
పెదపూడి	181	163	18

మండలం	సచివాలయాలు	పింఛన్లు	నగదు (రూపాయల్లో)
అనపర్తి	19	10,438	6,99,51,500
బిక్కవోలు	21	10,786	7,14,02,000
పెదపూడి	20	10,645	6,98,91,000
రంగంపేట	19	9,035	6,08,33,000
	79	40,904	27,20,77,500

బిక్కవోలు: ప్రతి నెలా ఒకటో తేదీన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్లు, ఒంటరి మహిళలు, సంప్రదాయ చర్మకారులు, డప్పు కళాకారులకు ఇచ్చే సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కోసం అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. గతంలో వలంటీర్లు నేరుగా ఇంటింటికీ వెళ్లి తమ పరిధిలోని 50 ఇళ్ల లబ్ధిదారులకు ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లు అందించేవారు. దూర ప్రాంతాల్లో ఉన్న, అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్న లబ్ధిదారులకు సైతం వలంటీర్లు స్వయంగా పింఛన్ తీసుకెళ్లి ఇచ్చేవారు. ఇప్పుడు వలంటీర్ల స్థానంలో సచివాలయ సిబ్బందితో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగుల సేవలను వినియోగించుకోవడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీలైనంత వరకూ ఒకటో తేదీనే పంపిణీ పూర్తి చేసేలా చూడాలని ఆదేశాలు జారీ చేసింది.

నియోజకవర్గంలో 79 సచివాలయాల పరిధిలో నియోజకవర్గంలో 40,904 మంది పింఛన్‌దారులన్నారు. సోమవారం జరగనున్న పింఛన్ల పంపిణీలో 594 మంది సచివాలయ సిబ్బందితో పాటు ఇతర ఉద్యోగులు మరో 50 మంది కలిపి మొత్తంగా 644 మంది పాలు పంచుకోనున్నారు. క్లస్టర్ విధానం అనుసరించి ఒక్కొక్కరూ 50 పింఛన్లు ఇచ్చేలా సిబ్బందిని మ్యాపింగ్ చేశారు. పింఛన్ల పంపిణీ కోసం సచివాలయ పరిధిలో పనిచేస్తున్న ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీస్ తదితర సిబ్బంది సేవలను వినియోగించుకోనున్నారు. మొత్తం పింఛన్ల పంపిణీకి ఈ సిబ్బంది చాలకపోతే ఇతర శాఖలకు చెందిన మండల స్థాయి అధికారుల సేవలూ వినియోగించుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎంపీడీవోలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 1వ తేదీ సోమవారం ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ నిమిత్తం మొత్తంగా రూ.27.20 కోట్లు అవసరమవుతుంది. ఈ మొత్తాన్ని శనివారమే బ్యాంకు నుంచి విత్ డ్రా చేశారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు.

ఇంటి వద్దనే పింఛన్ అందిస్తాం



మండలంలోని పింఛన్‌దారులందరికీ సచివాలయ సిబ్బంది సోమవారం ఉదయం 6 గంటల నుంచి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందించనున్నారు. తొలి రోజే నూరు శాతం పంపిణీ పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకున్నాం.

– విజయలక్ష్మి, ఎంపీడీవో, బిక్కవోలు

అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి

ఎమ్మెల్యే బత్తుల



సింగవరంలో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

సీతానగరం: ప్రజారోగ్య రక్షణలో ప్రజాప్రతినిధిగా తనతో పాటు, అధికారులూ బాధ్యతగా వ్యవహరించాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. ఆదివారం సింగవరంలో ఎమ్మెల్యే బలరామకృష్ణ పర్యటించారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉందని, అపరిశుభ్రత పెరిగి, అంటువ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు ఆయన వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులను ఎమ్మెల్యే నిలదీశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. డ్రైనేజీ వ్యవస్థను సరిచేసి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ కృష్ణప్రసాద్, పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ అవినాష్, పంచాయతీ సెక్రటరీ, సర్పంచ్ సంగన పోశియ్య పాల్గొన్నారు.

సొసైటీ సభ్యులు ఈకేవైసీ తప్పనిసరి

రాజానగరం: తమ సొసైటీ పరిధిలో ఉన్న సభ్యులంతా ఈకేవైసీ చేయించుకోవాలని కానవరంలోని శ్రీరామకృష్ణ విశాల సహకార పరపతి సంఘం సీఈఓ నల్లమిల్లి దుర్గారావు అన్నారు. మండలంలో కానవరం, పల్లకడియం, రామస్వామిపేట, ముక్కినాడ, మల్లంపూడి, తోకాడ, ఫరిజల్లిపేట, రాజానగరం, సూర్యారావుపేట, తూర్పుగానుగూడెం, వెలుగుబంద, చక్రద్వారబంధంల్లోని సభ్యులు తమ ఆధార్ కార్డు, పాన్ నంబరు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను తెచ్చి, సొసైటీలో సభ్యత్వాన్ని ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సొసైటీల్లో చేపట్టిన కంప్యూటరైజేషన్‌లో భాగంగా సభ్యులు ఈకేవైసీ చేయించుకోవడం తప్పనిసరి అన్నారు. సొసైటీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు కూడా ఇది అవసరమన్నారు.

కంప్యూటరైజేషన్ చేస్తున్నాం..

సీతానగరం: చినకొండేపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ సభ్యులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని పీఏసీఎస్ సీఈఓ పేరిచర్ల సుబ్బరాజు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సొసైటీలో ఉన్న పెదకొండేపూడి, చీపురుపల్లి, నాగంపల్లి, అచ్చయ్యపాలెం, చినకొండేపూడిల్లోని సంఘ సభ్యుల రికార్డులను రెండు నెలలుగా కంప్యూటరైజేషన్ చేస్తున్నామన్నారు. సంఘంలో సభ్యత్వం తీసుకుని, ఇంతవరకు లావాదేవీలు జరపని సభ్యులు తమ రికార్డులను కంప్యూటరైజేషన్ చేయించుకోవాలన్నారు. ఇందుకు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ రెండు ఫొటోలు, సెల్ నంబర్‌తో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.